

www.hamsakalam.com

PRGI: TGTEL/26/A3129

సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA

చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:85 SUNDAY , AUGUST 09, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 85 ఆదివారం 09 ఆగష్టు 2026 పేజీలు :8 వెల: 4/-


# ఢిల్లీలో ధర్నాలేమిటి..

## జంతర్ మంతర్‌ను ఎందుకు మూసేయరు

**జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా ఎందుకు కొనసాగిస్తున్నారని కేంద్రాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు**



**నిరసనల పేరుతో నగరాన్ని బందీగా మార్చడం సరికాదని కీలక వ్యాఖ్య**

**ధర్నాకు అనుమతి కోరిన ఓ కమిటీ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు**

**ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, సెక్షన్ 144 అమల్లో ఉందని తెలిపిన కేంద్రం**

హంసకలం వార్త : దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా ఎందుకు కొనసాగిస్తున్నారు? దానిని ఎందుకు మూసివేయకూడదని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. నిరసనల పేరుతో నగరాన్ని బందీగా మార్చడం సరికాదని శుక్రవారం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అమిత్ మహాజన్ విచారణ చేపట్టారు. సుమారు 75 మందితో శాంతియుతంగా నిరసన తెలిపేందుకు తాము జూలైలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పోలీసులు ఇప్పటివరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సంజోయ్ ఘోష్ కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, "అసలు జంతర్ మంతర్‌ను ఎందుకు మూసివేయకూడదు? నా అభిప్రాయం ప్రకారం ఇటువంటి నిరసనలు నగర నడిబొడ్డున జరగకూడదు. అనవసరంగా నగరాన్ని ఎందుకు బందీగా మార్చాలి?" అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శనలు నగరం వెలుపల జరగాలని మిగతా2లో



## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

హంసకలం వార్త : సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. మిగతా2లో

# మూసీ సుందరీకరణకు తొలి అడుగు..



**దసరాలోగా టెండర్ల ప్రక్రియకు సిద్ధమవుతున్న ఎంఆర్‌డీసీఎల్**

**రూ.7,055 కోట్లతో 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు**

**పనులు ప్రారంభమైన రెండేళ్లలో ఫేజ్-1 పూర్తి చేయాలని లక్ష్యం**

**భూసేకరణ, చెట్ల తొలగింపునకు స్పష్టమైన ప్రణాళిక**

హంసకలం వార్త : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న మొదటి దశ (ఫేజ్-1) పనులకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఆగస్టు 5న ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేసింది. మిగతా2లో



## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించిన ప్రధాని**

**డిగ్రీలతో పాటు దేశం కోసం ఏదైనా చేయాలనే కలను మోసుకెళ్తున్నారన్న మోదీ**

**3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, ప్రతిభావంతులకు పురస్కారాలు**

**ప్రతిభావంతులైన విద్యార్థినుల సంఖ్య పెరగాలంటూ సరదాగా వ్యాఖ్య**

హంసకలం వార్త : ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్ కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. "మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. మిగతా2లో

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు



**● ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్ ● నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్ ● 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్ ● ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.



## శ్రీశైలానికి పోటెత్తిన వరద

- 875 అడుగులకు చేరువలో జలాశయం నీటిమట్టం
- ప్రస్తుత నీటి నిల్వ 162 టీఎంసీలు, పూర్తి సామర్థ్యానికి 10 అడుగుల దూరం
- రెండు రాష్ట్రాల పవర్‌హౌస్‌లలో మొదలైన విద్యుదుత్పత్తి
- నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

2

## 'మహాలక్ష్మి' పథకం విస్తరణ

### మరో 5 లక్షల కుటుంబాలకు రూ.500 గ్యాస్

**కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పెరిగిన అర్హుల సంఖ్య**

**కొత్త లబ్ధిదారుల జాబితా ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపిన పౌరసరఫరాలు**

**ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 42.90 లక్షల కుటుంబాలకు అందుతున్న సబ్సిడీ**

**ఆర్థిక శాఖ ఆమోదం తర్వాత నేరుగా ఖాతాల్లోకి సబ్సిడీ జమ**

హంసకలం వార్త : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగం గా అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక 'మహాలక్ష్మి' పథకాన్ని మరింత మందికి చేరువ చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ పథకంలో భాగమైన రూ.500కే గ్యాస్ సిలిం డర్ సదుపాయాన్ని కొత్తగా మరో 5 లక్షలకు పైగా పేద 2లో



## షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీ కూల్చివేత

**మెదక్ జిల్లా జప్తిశివునూర్‌లో షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీని కూల్చేసిన రైతులు**

**శతాబ్దాల నాటి దారిని మూసేసి కాంపౌండ్ కట్టారంటూ ఆగ్రహం**

**తమకు దారి చూపే వరకు తగ్గేదే లేదని హెచ్చరిక**



హంసకలం వార్త : పంట పొలాలకు వెళ్లే దారిని మాయం చేశారంటూ ఆగ్రహించిన గ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ ను 2లో

## ఇరాన్‌తో యుద్ధం నుంచి అమెరికా తప్పుకోవాలి



**జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్**

**-ఇరాన్‌తో ఐదు నెలలుగా సాగుతున్న యుద్ధం -అమెరికా ఆయుధ నిల్వలు పడిపోయాయంటూ కథనాలు**

**-యుద్ధం కొనసాగితే ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న డాన్ కేన్**

హంసకలం వార్త : ఇరాన్‌తో గత ఐదు నెలలుగా సాగుతున్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు పడిపోతుండటంతో యుద్ధానికి ముగింపు పలకాలనే డిమాండ్లు స్వదేశంలో వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా మిగతా2లో

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

# నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు

ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు. "మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశం య్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు" అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లా డుతూ.. "ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకో వట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు" అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెం ట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పంది స్తూ.. "ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి" అని వ్యాఖ్యానించ డంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి. అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

# మూసీ సుందరీకరణకు తొలి అడుగు..

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవనం, సుందరీకరణ ప్రాజెక్టు పనుల్లో కీలక ముందడుగు పడింది. ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న మొదటి దశ (ఫేజ్-1) పనులకు రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఆగస్టు 5న ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈసీ) జారీ చేసింది. ఈ అనుమతి లభించడంతో, దసరా పండుగలోపే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) కసరత్తు వేగవంతం చేసింది. హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చే ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 21 కిలోమీటర్ల మేర 'వి' ఆకారంలో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. దీని కోసం మొత్తం రూ. 7,055 కోట్లు ఖర్చు చేయనుండగా, పనులు ప్రారంభమైన నాటి నుంచి రెండేళ్లలోగా, అంటే 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఈ నిధులతో నదికి ఇరువైపులా 30 మీటర్ల వెడల్పుతో రోడ్లు, సర్వీసు రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్టీపీలు, పంపింగ్ స్టేషన్లు, వరద నియంత్రణకు చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేస్తారు. వీటికి తోడు పచ్చటి కారిడార్లు, పార్కులు, సాంస్కృతిక కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. నదిలో సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా వర్షాకాలంలో 30 శాతం, ఇతర సమయాల్లో 20 శాతం నీటి ప్రవాహం ఉండేలా చూడనున్నారు. మొదటి దశ కోసం మొత్తం 495 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 158 ఎకరాల ప్రభుత్వ, 146 ఎకరాల పట్టా, 30 ఎకరాల రక్షణ శాఖ భూములతో పాటు 126 ఎకరాల నదీ పరివాహక ప్రాంతం ఉంది. ఈ పరిధిలో 639 శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు ఉన్నట్లు తేల్చారు. ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే 2,660 చెట్లలో చాలావాటిని మరోచోటికి తరలించనున్నట్లు, తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే 1:10 నిష్పత్తిలో కొత్త మొక్కలు నాటనున్నట్లు అధికారులు తమ నివేదికలో స్పష్టం చేశారు. మొత్తం మీద, కీలకమైన పర్యావరణ అనుమతులు లభించడంతో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానుండటంతో హైదరాబాద్ మహానగరానికి ఇది కొత్త శోభను తీసుకురానుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఢిల్లీలో ధర్నాలేమిటి.. జంతర్ మంతర్‌ను ఎందుకు మూసేయరు

దీనిపై స్పందించిన న్యాయమూర్తి, "అసలు జంతర్ మంతర్‌ను ఎందుకు మూసివేయకూడదు? నా అభిప్రాయం ప్రకారం ఇటువంటి నిరసనలు నగర నడిబొడ్డున జరగకూడదు. అనవసరంగా నగరాన్ని ఎందుకు బందీగా మార్చాలి?" అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శనలు నగరం వెలుపల జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ వాదనలు వినిపిస్తూ, జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించవచ్చా లేదా అనే అంశాన్ని సుప్రీంకోర్టు ఇప్పటికే పరిశీలిస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల నేపథ్యంలో ఆ ప్రాంతంలో సెక్షన్ 144 అమల్లో ఉందని, భారీగా భద్రతా బలగాలను మోహరించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉభయ పక్షాల వాదనలు విన్న హైకోర్టు, పిటిషనర్ దరఖాస్తుపై ఆగస్టు 8లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది. జంతర్ మంతర్‌కు బదులుగా రామ్‌లీలా మైదానం వంటి ప్రత్యామ్నాయ వేదికలను పరిశీలించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇప్పటికే కేంద్రం స్పందన కోరింది.

# ఇరాన్‌తో యుద్ధం నుంచి అమెరికా తప్పుకోవాలి



ఇరాన్‌తో గత ఐదు నెలలుగా సాగుతున్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు పడిపోతుండటంతో యుద్ధాని కి ముగింపు పలకాలనే డిమాండ్లు స్వదేశంలో వేగవం తమయ్యాయి. ఈ నేపథ్యంలో, అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్, అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కార్యవర్గానికి తీవ్ర హెచ్చరికలు చేసినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. కేవలం వైమానిక దాడులతో నిర్దేశిత లక్ష్యాలను సాధించలేమని, యుఎస్-ఇరాన్ యుద్ధం మరింత విస్తరిస్తే తీవ్ర ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ట్రంప్ సలహాదారులకు అంతర్గతంగా స్పష్టం చేశారు. ఈ అంశంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్‌తో ఆయన చర్చించినట్లు సమాచారం. మరోవైపు, సుదీర్ఘ వైమానిక దాడుల వల్ల అమెరికాకు చెందిన 80శాతం మిసైల్ డిఫెన్స్ ఇంటర్ సెప్టర్లు, సగానికి పైగా పేట్రియాట్ క్షిపణులు ఖాళీ అయ్యాయనే కథనాలు ట్రంప్ ఖండించినప్పటికీ, ఆయుధ కొరతపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో యుద్ధానికి ముగింపు పలకాలని డాన్ కేన్ సూచించడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది.

# షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీ కూల్చివేత




పంట పొలాలకు వెళ్లే దారిని మాయం చేశారంటూ ఆగ్రహించిన గ్రామస్తులు... రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్‌ను నేలమట్టం చేశారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తిశివునూర్‌లో ఈ ఉదయం ఒక్కసారిగా విరుచుకుపడ్డ రైతులు, శతాబ్దాల నాటి ప్రధాన బాటను మూసివేసి కాంపౌండ్ కట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. గతంలో ఈ సమస్యపై షబ్బీర్ అలీకి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని... పొలాలకు రాకపోకలు బంద్ కావడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్థానికులు మండిపడ్డారు. విషయం తెలుసుకుని రంగంలోకి దిగిన పోలీసులు గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు తమకు దారి చూపే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో జప్తిశివునూర్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఊరిలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# శ్రీశైలానికి పోటెత్తిన వరద..

కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాల ప్రాజెక్టు నుంచి 2,57,059 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, శ్రీశైలం జలాశయానికి 2,11,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం అది 874.70 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయిలో నిండటానికి మరో 10 అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 162.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రెండు, మూడు రోజుల్లో నీటి నిల్వ 200 టీఎంసీలను దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు. భారీగా వరద నీరు వస్తుండటంతో అధికారులు జలవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 21,189 క్యూసెక్కుల నీటిని వినియోగించి 7.319 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 9,603 క్యూసెక్కుల నీటితో 1.684 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుదుత్పత్తి అనంతరం 30,792 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. వీటితో పాటు వెలిగోడుకు 4,000 క్యూసెక్కులు విడుదల చేయగా, శనివారం గోరకల్లు జలాశయానికి మరో 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# 'మహాలక్ష్మి' పథకం విస్తరణ..

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక 'మహాలక్ష్మి' పథకాన్ని మరింత మందికి చేరువ చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఈ పథకంలో భాగమైన రూ.500కే గ్యాస్ సిలిండర్ సదుపాయాన్ని కొత్తగా మరో 5 లక్షలకు పైగా పేద కుటుంబాలకు విస్తరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను పౌరసరఫరాల శాఖ సిద్ధం చేసి, ఆమోదం కోసం ఆర్థిక శాఖకు పంపింది. ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించి, నిధులు విడుదలైన వెంటనే కొత్త లబ్ధిదారులకు సబ్సిడీ అందనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 42.90 లక్షల కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి. 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఈ పథకంపై అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయగా, 'ప్రజా పాలన' కార్యక్రమం ద్వారా దాదాపు 91.49 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం తొలి దశలో 42.90 లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. ఈ లబ్ధిదారుల గ్యాస్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో రూ. 723.30 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో 1.20 కోట్లకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నప్పటికీ, తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకే ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గతంలో వివాహం చేసుకుని కొత్తగా కాపురం పెట్టిన జంటలకు వేరుగా రేషన్ కార్డులు లేకపోవడం, ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు ఉన్నా ఒకే కార్డు ఉండటం వంటి కారణాలతో చాలామంది అర్హులు పథకానికి దూరమయ్యారు. అయితే, ప్రభుత్వం 2025 జనవరి నుంచి 2026 జులై మధ్య కాలంలో పెద్ద ఎత్తున కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. ఈ కొత్త రేషన్ కార్డులు పొందిన వారు మహాలక్ష్మి పథకం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన పౌరసరఫరాల శాఖ, 5 లక్షలకు పైగా కుటుంబాలను అర్హులుగా నిర్ధారించింది. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రాగానే ఉమ్మడి జిల్లాల వారీగా కొత్త లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం సబ్సిడీ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

# సంపాదకీయం

## విశ్లేషణలలో మేటి... మాటల ఘనాపాఠి



ఒక మనిషి జీవితం ఎంతకాలం సాగిందన్నది చరిత్రకు పెద్ద విషయం కాదు. ఆ జీవితం సమాజానికి ఎంత వెలుగునిచ్చిందన్నదే అసలైన ప్రమాణం. అలాంటి ప్రమాణాలతో కొలిచినప్పుడు తెలుగు జర్నలిజం ఆకాశంలో ధ్రువతారగా ప్రకాశించే పేరు తుర్లపాటి కుటుంబరావు. ఆగస్టు 10 ఆయన జన్మదినం మాత్రమే కాదు; అది తెలుగు జర్నలిజం నిబద్ధతను, ప్రజాజీవిత విలువలను, మానవ సంబంధాల గొప్పతనాన్ని స్మరించుకునే సందర్భం కూడా. 1933లో విజయవాడలో జన్మించిన తుర్లపాటి కుటుంబరావు పద్నాలుగేళ్ల వయసులోనే జర్నలిజంలో అడుగుపెట్టారు. ఏడున్నర దశాబ్దాలకు పైగా సాగిన ఆయన పాత్రికేయ ప్రయాణం నేటి తరానికి ఆశ్చర్యాన్ని, భావితరాలకు స్ఫూర్తిని కలిగిస్తుంది. నాటి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నుంచి నేటి నరేంద్ర మోదీ వరకు, 'జాతిపిత' మహాత్మాగాంధీ ఆలోచనల నుంచి ఆధునిక భారత రాజకీయ పరిణామాల వరకు, స్వాతంత్ర్య సమరయోధుల నుంచి సినీ దిగ్గజాల వరకు... భారత ప్రజాజీవితంలోని ఎందరో మహనీయులతో ప్రత్యక్ష అనుబంధం కలిగిన అరుదైన వ్యక్తి తుర్లపాటి.

జర్నలిజం అంటే వార్తలను అందించడం మాత్రమే కాదని, సమాజానికి విలువలను అందించడమని తుర్లపాటి నిరూపించారు. దాదాపు యాభై సంవత్సరాల పాటు నిరంతరాయంగా సాగిన 'వార్తల్లోని వ్యక్తి' శీర్షిక వ్యక్తిత్వాల విశ్లేషణకు, నాయకత్వ విలువల అంచనాలకు ఒక పాఠశాల. వ్యక్తులను కీర్తించడం కాదు, వారి జీవితం సమాజానికి అందించే సందేశాన్ని వెలికితీయడం ఆ రచనల ప్రత్యేకత. విశ్లేషణ ఆయనకు అలవాటు. వాక్చాతుర్యం ఆయనకు వరం. అందుకే ఆయనను చాలా మంది 'మాటల ఘనాపాఠి' అని సంబోధించేవారు. వేలాది సభలకు అధ్యక్షత వహించి, దాదాపు 18 వేల ఉపన్యాసాలతో 'గిన్నిస్' గుర్తింపు పొందారు. సాహిత్యం, చరిత్ర, రాజకీయాలు, సంస్కృతి, సినిమా... ఏ రంగాన్ని తీసుకున్నా తుర్లపాటి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. మహానాయకులు, జాతి నిర్మాతలు, 1857 విప్లవ వీరులు, నా కలం--గళం వంటి రచనల ద్వారా యువతకు చరిత్రను పరిచయం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్‌ను స్థాపించి కళాకారులను సత్కరించే సంప్రదాయానికి బాటలు వేశారు. నంది అవార్డుల ఆవిర్భావానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. అక్కినేని నాగేశ్వరరావుకు 'నటసామ్రాట్', కృష్ణకు 'సూపర్ స్టార్' వంటి బిరుదులు అందించిన దూరదృష్టి ఆయనది. కళాకారుల ప్రతిభను సమాజం ముందుకు తీసుకురావడంలో ఆయన పాత్ర విశిష్టమైనది.

భారత ప్రభుత్వం ప్రదానం చేసిన పద్మశ్రీ పురస్కారం, ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన కళాప్రపూర్ణ, జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి వచ్చిన అనేక గౌరవాలు... ఇవన్నీ ఆయన వ్యక్తిగత విజయాల గుర్తింపే. మా నాన్నగారు 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు దివంగత తుంగా రాజగోపాలరెడ్డి స్మృత్యంకంగా స్థాపించిన 'తుంగా అవార్డు' అందుకున్న ప్రముఖులలో తుర్లపాటి ఒకరు కావడం మా సంస్థకే గర్వకారణం. ఎన్ని సత్కారాలు, పురస్కారాలు అందుకున్నా ఆయనకు అసలైన సంపద మాత్రం ప్రజల ప్రేమాభిమానాలే. అధికారం, ఆస్తులు, పదవుల కోసం ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు. అనేక మంది ప్రధానులు, ముఖ్యమంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆ పరిచయాలను ఉపయోగించుకోలేదు. నీతి, నిజాయితీ, నిష్పాక్షికత ఆయనకు అలంకారాలు కాదు; అవే ఆయన జీవన విధానం.

వ్యక్తిగత జీవితంలో ఎన్నో విషాదాలను ఎదుర్కొన్నారు. జీవిత భాగస్వామిని, కుమార్తెను కోల్పోయారు. ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా చిరునవ్వును కోల్పోలేదు. రాజకీయాలకు అతీతంగా అందరితో ఆప్యాయత, కుల మతాలకు అతీతంగా మానవత్వం, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆదరించే గుణం... ఇవే ఆయనను మహోన్నత వ్యక్తిగా నిలబెట్టాయి. తుర్లపాటి జీవితం ఒక విలువల పాఠ్యగ్రంథం. జర్నలిజం అంటే అధికారాన్ని ప్రశ్నించడం, సమాజాన్ని చైతన్యపరచడం, సత్యాన్ని కాపాడడం, మానవత్వాన్ని నిలబెట్టడం అని ఆయన తన జీవితంతో నిరూపించారు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు; ఒక విశ్వవిద్యాలయం. ఒక పాత్రికేయుడు కాదు; ఒక విలువల ఉద్యమం. ఒక వక్త కాదు; ఒక చైతన్య స్వరం.

తుర్లపాటి జన్మదినాన్ని స్మరించుకుంటూ మనం నివాళి అర్పించాల్సింది కేవలం ఒక మహనీయునికే కాదు... ఒక ఆదర్శానికి, నిబద్ధతకు, నిజాయితీకి, మానవత్వానికి. తెలుగు జర్నలిజం ఉన్నంతకాలం తుర్లపాటి కుటుంబరావు పేరు చిరస్థాయిగా నిలుస్తుంది. ఎందుకంటే చరిత్రలో కొన్ని పేర్లు పుస్తకాలలో మాత్రమే ఉండవు; తరతరాల మనుషుల మనసుల్లో విలువలుగా చిరకాలం జీవిస్తాయి. అలాంటి అమరనామమే పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు.

# గాంధీ గర్వించే 'దేశద్రోహులు'!

ఏ దేశ పౌరులలోనైనా మహోన్నతులు ఎవరు? ప్రజాహితాన్ని పట్టించుకోని పాలకులను ప్రశ్నిం చేవారు, అధికారానికి ఎట్టి పరిస్థితులలోను మోకరి ల్లనివారు, దేశ స్వాతంత్ర్యాన్ని, జాతి గౌరవాన్ని కాపాడేందుకు, అవసరమైతే ప్రభుత్వాన్ని సైతం ఎదిరించేందుకు వెనుకాడనివారే నిక్కమైన దేశభ క్తులు, గొప్ప పౌరులు' -- ఇవి, ఫ్రెంచ్ రచయిత ఆల్బర్ట్ కామూ ఉద్ఘాటించిన సత్యాలు. ఇరవయో శతాబ్ది బ్రిటిష్ చరిత్రకారులలో అగ్రగణ్యుడైన ఏజేపీ టేలర్ ఆధునిక జర్మనీ, ఆధునిక బ్రిటన్, ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు, లార్డ్ బీవర్ బ్రూక్ మీడియా సామ్రాజ్యంపై పలు పుస్తకాలు రాశారు. అయితే అన్నిటిలోకి తనకు బాగా ఇష్టమైన పుస్తకం ' అని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. గ్రేట్ బ్రిటన్ విస్తరణవాద, సామ్రాజ్యవాద విదేశాంగ విధానాలను వ్యతిరేకించిన బ్రిటిష్ రాజనీతిజ్ఞుల గురించిన అధ్యయనాలే ఆ విశిష్ట గ్రంథం.

19వ శతాబ్ది ఉదారవాద రాజకీయవేత్త జాన్ బ్రైట్ ఆ రాజనీతిజ్ఞులలో ఒకరు. బ్రైట్ మహాశయుడు ఒక సార్వకాలిక మహావక్త. కామన్స్ సభలో పార్లమెంటరీ సంస్కరణలు, విదేశాలలో బ్రిటిష్ సైనిక జోక్యాలకు వ్యతిరేకంగా ఆయన ప్రసంగాలు ప్రజలను ప్రభా వితం చేశాయి, పాలకులకు దడ పుట్టించాయి. ప్రభుత్వ విధానాలపై ఆయన విమర్శలు టోరీలను కోపావేశులను చేశాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా బ్రైట్ వదరుతున్నాడని వారు ఆరోపిం చారు. ఆ అభియోగంపై ఆ ఉదారవాద రాజనీతిజ్ఞుడు తీక్షణంగా ప్రతిస్పందించాడు: 'నేను మీ కంటే ఎక్కువగా ఆంగ్లేతరుడిని, దేశ వ్యతిరేకిని ఎలా కాగలను? నేను ఈ గడ్డపై పుట్టలేదా? నేను కూడా మీరు వచ్చిన ఇంగ్లీష్ వంశం నుంచే రాలేదా? నా కుటుంబం ఈ దేశ భద్రత, శ్రేయస్సుకు కట్టుబడలేదా? నాకు ఉన్న సిరి సంపదలు ఏవైనా మీ ఆస్తిపాస్తుల మాదిరిగానే మన మాతృభూమి సుపరి పాలనపైనే ఆధారపడి ఉన్నాయి కదా. మరి ఈ దేశ వ్యవహారాలకు సంబంధించిన ఒక అంశంపై తోటి దేశస్థుడు ఒకరు భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉన్నాడనే కారణంతో అతడిని దేశ ద్రోహి, జాతి వ్యతిరేకి అని మీరు ఎలా అంటారు?'నేను ఈ మాటలను మూడు దశాబ్దాల క్రితం మొట్టమొదటిసారి చదివినప్పుడు నా మనసులో నాటుకుపోయాయి. ముఖ్యంగా 'దేశ ద్రోహి' లేదా 'దేశ వ్యతిరేకి' (యాంటీ--నేషనల్) అనే నిందాపూర్వకమైన తిట్టు నా యవ్వనకాల భారతదేశంలో సర్వత్రా వినిపిస్తుండేది. సాక్షాత్తూ మన ప్రధానమంత్రే స్వయంగా ఆ దూషణ పదాన్ని ఉపయోగించారు. 1971లో భారీ మెజారిటీతో అధికారాన్ని గెలుచుకున్న ఇందిరాగాంధీ క్రమంగా నిరంకుశ పాలకురాలిగా పరిణమించారు. భిన్నాభి ప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోయారు. రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలు అన్నిటినీ తన అధికా రానికి దాసోహం చేసుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌ను తన కుటుంబ సంస్థానంగా మార్చి వేశారు. ఇందిర పాలనా విధానాలను స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కళంక ప్రజానాయకుడు జయ ప్రకాశ్ నారాయణ్ ప్రశ్నించారు. ఆయనతో సహా ప్రతిపక్ష నాయకులు చాలామందికి విదేశీ నిధులు అందుతున్నాయని ఇందిర ఆరోపించారు.

ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తన విమర్శకులను దేశ వ్యతిరేకులు అని నిందించారు. మోదీ సర్కార్ విధానాలను వ్యతిరేకించే వారికి ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్ నుంచి ఆర్థిక లబ్ధి సమకూ రుతుందని లేదా అమెరికా వ్యాపార దిగ్గజం జార్జి సోరోస్ తరఫున వ్యవహరిస్తున్నారని ప్రధానమంత్రి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ పాలనను, మెజారిటేరియన్ విధానాలను వ్యతిరేకించేవారిని 'తుక్డే తుక్డే గ్యాంగ్'గా అభివర్ణి స్తున్నారు. ఈ సువిశాల భారతదేశాన్ని మరోసారి ముక్కలు చెక్కలు చేసేందుకు విదేశీ ప్రభుత్వాల తరఫున వ్యవహరిస్తున్నారని కూడా విమర్శిస్తున్నారు. 'అర్బన్ నక్సల్స్', 'మెకాలే పుత్రులు' సహా మరెన్నో నిందాపూర్వక మాటలతో దూషిస్తున్నారు.




ఈ దూషణలు, ఆరోపణలు అన్నీ నిరాధారమైన అనుమానాలే. ఒక స్పష్టమైన మానసిక రుగ్మతకు అవి తార్కాణాలు. ప్రశ్న పత్రాల లీక్‌లతో సహా ప్రభుత్వ విద్యావ్యవస్థలోని అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అశేష విద్యార్థుల నిరసనలపై సంఘ్ పరివార్ విమర్శలు ఆ అనుమానాస్పద ఆలోచనా విధానానికి తాజా నిదర్శనాలు. భారతీయులను రెండు వర్గాలుగా విభజించడం సంఘ్ పరివార్‌కు చెందిన అతి జాతీయవాదులకు పరిపాటి. మొదటి వర్గం దేశభక్తులు. వీరు జాతిశ్రేయస్సుకు అంకితమయినవారు. రెండో వర్గం దేశద్రోహులు. వీరు విశ్వాసఘాతకులు. మాతృభూమి ఉన్నతికి వ్యతిరేకులు. మోదీ ప్రభుత్వ మద్దతుదారులు మొదటివర్గం కిందకు వస్తారు. ప్రభుత్వ విధానాలతో విభేదించేవారు రెండో వర్గం కిందకు వస్తారు. అప్పుడప్పుడూ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారు సైతం దేశద్రోహుల కిందే లెక్క.

విద్యార్థుల నిరసనల సందర్భంలో 'దేశద్రోహి' అనే నిందాపూర్వక మాటలోని ద్వేషపూరిత కపటత్వం సుస్పష్టంగా కనిపిస్తున్నది. నేహా దీక్షిత్ ఇటీవల 'హిమల్'లో రాసిన ఒక వ్యాసంలో, ఆ నిరసనల్లో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ విద్యార్థిని ఒకరు చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు: 'నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారంతా 'దేశద్రోహులే' అన్న తిరస్కారపూరిత మాట వింటున్నాను. అయితే జాతీయ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీక్‌లు, వాటికి కారణమైన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చేందుకు దేశాన్ని పరిపాలిస్తున్న పార్టీ చేసిన ప్రయత్నాలు అవగతమైన తరువాత నేను ఒక సత్యాన్ని గ్రహించాను-- లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు దేశద్రోహులు కారని, భారత ప్రభుత్వమే దేశద్రోహానికి పాల్పడు తోందని'. నిండు సత్యం ఉన్న నిశిత వ్యాఖ్య ఇది, సందేహం లేదు.

ప్రభుత్వాన్ని అధిక్షేపించేందుకు వ్యంగ్యాన్ని ఉపయోగించుకోవడం ప్రస్తుత విద్యార్థి నిరసనల విలక్షణ విశేషం. ఈ యువ నిరసనకారులకు తెలియకపోవచ్చుగానీ దేశ పాలకులను నిలదీసే ందుకు తాము ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యంగ్యాత్మక అవహేళనలకు గౌరవార్హమైన పూర్వ దృష్టాంతాలు ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు విదేశీ ప్రభుత్వాల నుంచి ఆర్థిక లబ్ధి పొందుతున్నారని ఇందిరాగాంధీ ఆరోపించినప్పుడు స్వతంత్ర పార్టీ ఎంపీ పిలూ మోడీ ఒకరోజు 'నేను సీఐఏ ఏజెంట్‌ను' అని రాసి ఉన్న ప్లకార్డును మెడకు కట్టుకుని లోక్‌సభకు వచ్చారు. దశాబ్దాల అనంతరం మోదీ సర్కార్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు ప్రజ్వరి ల్లినప్పుడు బెంగళూరులో ఒక బహిరంగ సభకు స్వాతంత్ర్యానంతర భారతీయ సాహిత్య దిగ్గజాలలో ఒకరైన గిరీశ్ కర్నాడ్ 'నేనూ అర్బన్ నక్సల్‌నే' అని రాసి ఉన్న ఒక ప్లకార్డును మెడకు కట్టుకుని వచ్చారు. అధికారాన్ని వెటకారం చేయడంలో ఈ విలక్షణ సంప్రదాయాన్ని విద్యార్థి నిరసనకారులు మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లారు.

నిజమైన జాతీయవాది ఎవరు? ఆగ్నేయాసియా దేశాలలో జాతీయోద్యమాలను సమగ్రంగా అధ్య యనం చేసిన ఆంగ్లో--ఐరిష్ రాజకీయ శాస్త్రవేత్త బెనిడిక్ట్ ఆండర్సన్ ఒకసారి ఇలా రాశారు: 'ఇంట సొంత పౌరులపైన, బయట విశాల ప్రజానీకానికి వ్యతిరేకంగా తమ సొంత దేశం లేదా ప్రభుత్వం పాల్పడుతున్న నేరాలకు సిగ్గుపడనివారు, పడలేని వారు ఒక నిజమైన జాతీయవాది కాడు, కాలేడు కూడా. ఆండర్సన్ భావనతో గాంధీ, అంబే డ్కర్ అంగీకరించి ఉండేవారు. భారతీయ సమాజంలో సర్వత్రా ఉన్న అసమానతలు, జాతి పురోభివృద్ధికి ఆటంకమవుతున్నాయని, బ్రిటిష్ వలసపాలన నుంచి విముక్తమయ్యే లోగానే సామాజిక అంతరాలు, ఆర్థిక అసమానతలను అంతమొందించే కృషి ఆరంభమ వ్వాల్సిన అవసరం ఉందని గాంధీ, అంబేడ్కర్ ఇరువురూ భిన్నరీతుల్లోనే అయినప్పటికీ, పూర్తిగా గుర్తించారు. మరీ ముఖ్యంగా నిమ్న కులాల వారు ఎదుర్కొంటున్న అణచివేతలు, మహిళలకు మానవ హుందాను నిరాకరిస్తోన్న సామాజిక దురాచారాలు, దౌష్ట్యాలు శిఖరసమానులైన ఆ మానవీయులను అమితంగా వ్యాకులపరిచాయి. వివక్షలు, అన్యాయాల నుంచి వారిని విముక్తం చేసేందుకు ఆ ఇరువురూ దృఢ సంకల్పంతో కృషి చేశారు.

పరాయి పాలనను వదిలించుకుని, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా వ్యవస్థీకృతమైన భారత్, కుల అస్తిత్వాలను, జెండర్ అసమానతలను నిషేధించిన రాజ్యాంగాన్ని శిరసావహిస్తోంది. అయినప్పటికీ నిత్య జీవితంలోను, రాజ్య వ్యవహారాలలోను, విశాల సమాజ జీవితంలోను వివక్షలు, అన్యాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ శోచనీయ స్థితికి ఒక జాతీయవాది విధిగా లజ్జాభరితుడు కావాలి; ప్రభుత్వ భద్రతా దళాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించాలి; అడుగడుగునా ఎదురవుతున్న అవినీతిపై ఆగ్రహించాలి; ప్రభుత్వా ధికారుల, రాజకీయవేత్తల అసమర్థతను గర్హించాలి. జాతి శ్రేయస్సుకు అవరోధమవుతున్న అధికార భ్రష్టత్వాలను చూస్తూ ఉండిపోకూడదు. చైతన్యశీలి అయిన పౌరుడు, ధర్మ జ్వలిత అయిన పౌరురాలు జాతి దుస్థితి పట్ల తమ సిగ్గు, అపరాధ భావనను బహిరంగంగా పాలకులను నిలదీసే మాటలు, నిరసనలతో వ్యక్తం చేయకుండా ఉంటారా? చేస్తారు, తప్పక చేస్తారు. అది, దేశాన్ని మరింత సమున్నత, ఘనమైన భవిష్యత్తుకు తీసుకెళ్లాలని తోటి దేశస్థులకు పిలుపునిస్తూ వారు కదన శంఖం పూరించడమే అని భావించాలి. 'హిమల్' వ్యాస రచయిత్రి ఉటంకించిన ఉత్తరప్రదేశ్ విద్యార్థిని వ్యాఖ్యలు సంపూర్ణ సత్యాలు. ఆ విద్యావతి, ఆమె తోటి యువ భారతీయుల చైతన్యశీలతను చూసి గాంధీ, అంబేడ్కర్, జయప్రకాశ్ నారాయణ్ తప్పక గర్వించి ఉండేవారు.

# విగ్రహాలతో ఆదివాసీల అభివృద్ధి జరగదు!

దేశ జనాభాలో దాదాపు పది కోట్ల మందికి పైగా ఆదివాసీలు ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా, వారు ఇప్పటికీ భూమి, అడవి, సహజ వనరులపై తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రతో ఆదివాసీలకు విడదీయరాని బంధం ఉంది. అడవుల్లోని ఖనిజ సంపదను బ్రిటిష్ పాలకులు దోచు కోవడానికి ప్రయత్నించినప్పుడు వారికి వ్యతిరేకంగా ఆదివాసీలు తిరుగుబాటు చేశారు. 1855--56లో జరిగిన సంతాల్ తిరుగుబాటు ఈ ఉద్యమాలకు నాంది పలికింది. అనంతరం బిర్సా ముండా, కొము రం భీం, అల్లూరి సీతారామరాజు వంటి నాయకుల సారథ్యంలో జరిగిన పోరాటాలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేశాయి. స్వాతంత్ర్యం అనంతరం... ఆదివాసీల హక్కుల ప్రాధాన్యాన్ని ప్రముఖ ఆదివాసీ నాయకుడు జైపాల్‌సింగ్ ముండా నొక్కి చెప్పారు. బి.ఆర్.అంబేడ్కర్ ఐదవ, ఆరవ షెడ్యూళ్ల ద్వారా ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయంగా కూడా ఆదివాసీల హక్కులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. 2007లో ఐక్యరాజ్య సమితి 'యునైటెడ్ నేషన్స్ డిక్లరేషన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ఇండిజినస్ పీపుల్స్'ను ఆమోదించింది. అలాగే, అంతర్జాతీయ కార్మిక సంస్థ కూడా ఆదివాసీల హక్కులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించే ప్రయత్నం చేసింది.



ఆదివాసీల హక్కుల కోసం పలు చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో అనేక లోపాలు కనిపిస్తున్నాయి. 'పెసా' చట్టం గ్రామసభలకు విస్తృత అధికారాలను కల్పించింది. కానీ అనేక రాష్ట్రాల్లో ఈ చట్టం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. అభివృద్ధి పేరుతో చేపట్టే-- ఆనకట్టలు, గనుల తవ్వకాలు, పరిశ్రమలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల ఏర్పాటు వంటి అనేక పనులు ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చుతున్నాయి. నర్మదా, హీరాకుడ్, పోలవరం వంటి ప్రాజెక్టులే దీనికి ఉదాహరణ.

నేటికీ చాలా రాష్ట్రాల్లో ఆదివాసీలు తమ హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వాలు ఒకవైపు ఆది వాసీ దినోత్సవాలు జరుపుతూ బిర్సా ముండా వంటి నాయకుల విగ్రహాలను ప్రతిష్ఠిస్తుండగా, మరోవైపు ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతున్న నాయ కులు, కార్యకర్తలు నిర్బంధాలకు గురవుతుండటం ఒక విరుద్ధమైన పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఆదివాసీల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. అందువల్ల పెసా చట్టాన్ని కచ్చితంగా అమలుచేయడంతో పాటు, విద్య, ఉపాధి, స్వయం ప్రతిపత్తి, సాంస్కృతిక హక్కుల పరిరక్షణ ద్వారానే ఆదివాసీ సంక్షేమం సాధ్యమవుతుంది. అప్పుడే ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి నిజమైన అర్థం చేకూరుతుంది.

# ప్రాజెక్ట్ ఉద్వాసన”కు విశేష స్పందన









( ఆగస్టు-8- హంస కలంవార్త)

ఒక్కరోజులో 983.85 కిలోల దివ్య వ్యర్థాల సేకరణ

మల్కాజ్‌గిరి: పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలకు గౌరవం కల్పించే లక్ష్యంతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ( ఎం ఎం సి), లూప్ సస్టైనబిలిటీ సంస్థ సంయుక్తంగా చేపట్టిన “ప్రాజెక్ట్ ఉద్వాసన” కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దేవాలయాలు, ఇళ్లలో వినియోగానికి అనర్హంగా మారిన పాత దేవతా చిత్రాలు, విరిగిన ఫోటో ఫ్రేములు, విగ్రహాలను సాధారణ చెత్తలో కలవకుండా ప్రత్యేకంగా సేకరించి గౌరవప్రదంగా నిర్వహిస్తున్నారు. ఆగస్టు 8న మూడు జోన్ల పరిధిలో ఎంపిక చేసిన ఎనిమిది దేవాలయాల్లో నిర్వహించిన కార్యక్రమం ద్వారా మొత్తం 983.85 కిలోల దివ్య వ్యర్థాలను సేకరించినట్లు ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్య వ్యర్థాలను సాధారణ చెత్తలో కలపకుండా ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు భక్తుల విశ్వాసాలు, సంప్రదాయాలను గౌరవించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉద్వాసన పూజల్లో అధికారుల పాల్గొనడం శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన ఉద్వాసన పూజా కార్యక్రమంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ రవీందర్ సాగర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భక్తులు, స్థానిక పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఇళ్లలో ఉన్న పాత, విరిగిన దేవతా చిత్రాలు, ఫోటో ఫ్రేములు, విగ్రహాలను ప్రాజెక్ట్ ఉద్వాసనకు అందజేశారు. ఇప్పటివరకు 2.2 టన్నులకు పైగా సేకరణ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ ఉద్వాసన ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 2.2 టన్నులకు పైగా దివ్య వ్యర్థాలను సేకరించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన ఈ కార్యక్రమంపై ఉన్న విశ్వాసంతో పాటు పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో పెరుగుతున్న సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. మిగిలిన ఏడు దేవాలయాల్లోనూ కార్యక్రమాలు ఎంపిక చేసిన ఎనిమిది దేవాలయాల్లోని మిగిలిన ఏడు దేవాలయాల్లోనూ సంబంధిత డిప్యూటీ కమిషనర్లు పాల్గొని ఉద్వాసన పూజా కార్యక్రమాలను నిర్వహిం చారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు, స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ వద్ద ఉన్న దివ్య వ్యర్థాలను అధికారులకు అందజేశారు. భక్తి.. సంప్రదాయం.. పర్యావరణ పరిరక్షణ“భక్తి -- సంప్రదాయం -- పర్యావరణ పరిరక్షణ” అనే మూడు ప్రధాన అంశాలను సమన్వయం చేస్తూ ప్రాజెక్ట్ ఉద్వాసన కొనసాగుతోంది. దేవతా చిత్రాలు, విగ్రహాలను గౌరవప్రదంగా నిర్వహించడంతో పాటు అవి సాధారణ చెత్తలో కలవకుండా చూడటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంఎంసీ ప్రాధాన్యత ఇస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని దేవాలయాలు, ప్రాంతాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించి, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణహితమైన, సంప్రదాయాలను గౌరవించే దివ్య వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# వాసవి ఇంజనీరింగ్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

( ఆగస్టు -8- హంస కలంవార్త )

“అరైవ్ అలైవ్’ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ‘అరైవ్ అలైవ్’ ప్రచారంలో భాగంగా ఇబ్రహీంబాగ్‌లోని వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో శనివారం ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ( టి టి ఐ ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. టిటిఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, సిబ్బంది విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**-నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి**

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) సి. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనం నడిపేటప్పుడు పూర్తి అప్రమత్తతతో ఉండాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకూడదని సూచించారు. మన భద్రతతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

**-డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాల నివారణ**

ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి అప్రమత్తంగా డ్రైవింగ్ చేయడమే డిఫెన్సివ్ డ్రైవింగ్ అని ఆయన వివరించారు. డ్రైవింగ్ సమయంలో ఇతర వాహనాల కదలికలను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

**-గోల్డెన్ అవర్ ఎంతో కీలకం**





రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత తొలి ది60 నిమిషాలను ‘గోల్డెన్ అవర్’లిగా పేర్కొంటారని, ఈ సమయంలో బాధితుడికి సకాలంలో వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. అలాగే ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ‘రాహ్-వీర్ (గుడ్ సమారిటన్)’ పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన సహాయకులకు 25,000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందించే విధానం ఉందని వివరించారు.

**-హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి**

అనంతరం టి టి ఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించడం, వాహనాల మధ్య సురక్షిత దూరం నిర్వహించడం, అవసరమైన సమయంలో ఇండికేటర్లను ఉపయోగించడం, రోడ్డు సంకేతాలను గమనించడం, వాహనాలను మంచి కండిషన్‌లో ఉంచుకోవడం వంటి ప్రాథమిక భద్రతా సూత్రాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. రమణ, హెచ్‌ఓడి ఎస్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ జి. మీనా, టి టి ఐ సిబ్బంది కృష్ణతో పాటు సుమారు 800 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు..

# ఇంటి నంబర్ సృష్టించిన ఐదుగురి అరెస్ట్

(ఆగస్టు -8- హంస కలంవార్త )

ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో నకిలీ ఇంటి నంబర్, పన్ను అంచనా పత్రం సృష్టించి మోసానికి పాల్పడిన ఐదుగురిని ఆత్మకూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై పెద్దాపూర్ పంచాయతీ కార్యదర్శి నాగెల్లి అలియాస్ మారపెల్లి సంపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దాపూర్‌కు చెందిన బలభద్ర రాంబాబు తన ఖాళీ స్థలాన్ని విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఆ స్థలానికి ఇంటి నంబర్ లేకపోవడంతో త్వరగా నంబర్ పొందేందుకు కంప్యూటర్ ఆపరేటర్ బారుపట్ల సురేష్‌ను సంప్రదించాడు. సురేష్ రూ.10 వేల తీసుకుని 4-168/1 నంబర్, అసెస్‌మెంట్ నంబర్ 944తో ఇంటి పన్ను పత్రాన్ని తయారు చేయించాడు. ఈ క్రమంలో సురేష్, గెడిపె రమేష్ ద్వారా సుందరి ఉదయ్‌కుమార్‌ను సంప్రదించగా, అతను తన సహోద్యోగి మహమ్మద్ అజీజ్ సహాయంతో తెలంగాణ ఈ-పంచాయతీ వెబ్‌సైట్‌లో నకిలీ వివరాలను రూపొందించినట్లు పోలీసులు తెలిపారు. నకిలీ పత్రాన్ని వాట్సాప్ ద్వారా బలభద్ర రాంబాబుకు పంపినట్లు విచారణలో వెల్లడైంది.ఈ కేసులో ప్రధాన నిందితుడు బలభద్ర రాంబాబుతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు బారుపట్ల సురేష్, గెడిపె రమేష్, సుందరి ఉదయ్‌కుమార్, మహమ్మద్ అజీజ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు

## ఆషాఢ మాస బోనాల జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం



( ఆగస్టు -8- హంసకలం వార్త )

ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి

మల్కాజ్‌గిరి, ఆగస్టు 08: మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో నిర్వహించనున్న ఆషాఢ మాస బోనాల జాతరకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)లిను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఆషాఢ మాస బోనాల జాతర, ఫలహారం బండి ఊరేగింపు విశేషాలను కేటీఆర్‌కు ఎమ్మెల్యే వివరించారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అందించిన ఆహ్వానాన్ని స్వీకరించిన కేటీఆర్.. బోనాల జాతర సందర్భంగా నిర్వహించనున్న ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, జంగరాజు, శ్రీకాంత్ యాదవ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దల అనుభవాలు యువతకు మార్గదర్శకం: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



( ఆగస్టు -8- హంస కలంవార్త )

సీనియర్ సిటిజన్స్ యోగా డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూకట్‌పల్లి: శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కే పి హెచ్ బి 3వ ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ యోగా డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులతో పాటు అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన సీనియర్ సిటిజన్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. పెద్దలు ఏ విషయాన్ని చెప్పినా అది వారి జీవిత అనుభవం నుంచి వస్తుందని అన్నారు. వారి మాటలకు గౌరవం ఇచ్చి, వారు అందించే సందేశాలను స్వీకరించి జీవితంలో పాటిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. పెద్ద వయసులోనూ యోగా, ధ్యానం చేస్తూ తమ పనులను తామే చేసుకుంటూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవిస్తున్న సీనియర్ సిటిజన్లు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఆరోగ్యం పట్ల వారు చూపిస్తున్న శ్రద్ధ, జీవితంలో పాటిస్తున్న క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం వంటి ఎన్నో మంచి విషయాలను వారి నుంచి యువత నేర్చుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. యోగా, ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, యోగా గురువులు, సీనియర్ సిటిజన్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలర బండి ఊరేగింపునకు కూన శ్రీశైలం గౌడ్‌కు ఆహ్వానం

(ఆగస్టు -8- హంస కలంవార్త )



ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరిన కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రోడామేస్త్రి నగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పలో ఆగస్టు 11, 2026న నిర్వహించనున్న పాలర బండి ఊరేగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ను కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. రోడామేస్త్రి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ గుమస్తా మధుసూదన్తో కలిసి ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ అరుణ్ కూన శ్రీశైలం గౌడ్‌ను కలిసి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణ, ఊరేగింపు ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను నాయకులు మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మబండలో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

( ఆగస్టు -8- హంస కలంవార్త )



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఎస్ఐ శ్రీనివాస్ ఆల్విన్ కాలనీ:బోనాల పండుగ శుభసందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, జగద్గిరిగుట్ట ఎస్ఐ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు. ఫలహారం బండి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఎన్టీఆర్ నగర్ కాలనీలో పండుగ



వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువత, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలి: మంత్రి శ్రీధర్ బాబు

( ఆగస్టు -8- హంస కలంవార్త )



భూసేకరణ, అటవీ భూముల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి
నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణానికి భూసేకరణ అడ్డంకిగా మారకుండా చర్యలు తీసుకోవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన ఫలితాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో కలిసి ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టులు, రహదారులు, మున్సిపల్ అభివృద్ధి, వర్షాల వల్ల ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నీటిపారుదల ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ఆలస్యం కాకుండా చూడాలని, అటవీ భూముల బదలాయింపునకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు.

**-రోడ్ల పనులు వేగవంతం చేయాలి**

కొత్త రహదారుల నిర్మాణంతో పాటు దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా రోడ్ల పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు. జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంజనీర్ల కొరత ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అవసరమైన ఇంజనీర్లను డిప్యుటేషన్‌పై సాధ్యమైనంత త్వరగా నియమించి అభివృద్ధి పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**-వర్షాల వల్ల నష్టపోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన నివాస ప్రాంతాల పరిస్థితిపై మంత్రి సమీక్షించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అవసరమైన చోట ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలను కేటాయించే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు.
వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్లక్ష్యానికి గురైతే అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. మున్సిపాలిటీలు, ఎన్టీపీసీ, జెన్కో, సింగరేణి సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.

**-ప్రజాప్రతినిధుల సూచనలకు ప్రాధాన్యత**

జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, అమలులో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సమీక్షా సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా

(ఆగస్టు -8- హంస కలంవార్త )



ప్రజా నాయకుడిగా సాయన్న సేవలు చిరస్మరణీయం: వడ్డేపల్లి రాజేశ్వరరావు మేడ్చల్--మల్కాజ్‌గిరి: మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా అర్బన్ ఓబీసీ మోర్చా కార్యదర్శి పండుగ రేణుక ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కార్యక్రమానికి హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. పండుగ సాయన్న తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా నాయకుడని కొనియాడారు. నిజాం పాలనలోని నిరంకుశ అధికారాలను, దొరలు, దేశ్‌ముఖ్‌లు, భూస్వాముల దోపిడీని ప్రశ్నిస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడిగా సాయన్న చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. సుమారు 1860 ప్రాంతంలో జన్మించిన పండుగ సాయన్న తక్కువ వయసులోనే మరణించినప్పటికీ, ఆయన ప్రజల కోసం చేసిన పోరాటం కారణంగా లి"తెలంగాణ రాబిన్‌హుడ్"లిగా ప్రజల గుర్తింపును పొందారని రాజేశ్వరరావు పేర్కొన్నారు. దోపిడీకి గురైన పేద ప్రజలకు అండగా నిలిచి, సంపన్నులు, అధికార వర్గాల వద్ద ఉన్న సంపదను పేదలకు పంచిపెట్టడంతో పాటు, ఆనాటి నిరంకుశ పాలనా వ్యవ స్థను ఎదిరించి ప్రత్యామ్నాయ ప్రజా పాలన, బహుజన రాజ్య స్థాపన కోసం కృషి చేసిన ధీరుడు పండుగ సాయన్న అని తెలిపారు.

**-సాయన్న త్యాగం స్ఫూర్తిదాయకం**

పండుగ సాయన్న పోరాటాన్ని అణచివేసేందుకు ఆధిపత్య శక్తులు కుట్రలు పన్ని నిజాం ప్రభుత్వంతో కలిసి ఆయనను హతమార్చినప్పటికీ, సాయన్న త్యాగం, ధైర్యం, ప్రజా సేవా స్ఫూర్తి నేటికీ తెలంగాణ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉన్నాయని రాజేశ్వరరావు అన్నారు. పండుగ సాయన్న వీరగాథలను కిన్నెర కళాకారులు తమ గానంతో నేటికీ ప్రజలకు వినిపిస్తూ ఆయన చరిత్రను భావి తరాలకు చేరవేస్తున్నారని తెలిపారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కోసం సాయన్న చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు మల్లేష్ గౌడ్, దేశభత్తుల సుధా, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సతీష్ గౌడ్, వినోద్ కుమార్ గౌడ్, దిలీప్ కుమార్, రవితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

# ఆధునిక సవాళ్లకు అనుగుణంగా పోలీసింగ్‌లో మార్పులు అవసరం





( ఆగస్టు -8- హంస కలంవార్త )

హైదరాబాద్‌లో ఘనంగా జాతీయ పోలీస్ సెమినార్ హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని టీజీ ఐ సి సి సి భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 'లక్ష్యం చారిటబుల్ సొసైటీ' ఆధ్వర్యంలో "పోలీస్ వ్యవస్థ ఆధునీకరణ, శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిర్వహణ--నూతన సవాళ్లు" అనే అంశంపై జాతీయ స్థాయి పోలీస్ సెమినార్ శనివారం ఘనంగా నిర్వహించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌కు లక్ష్యం చారిటబుల్ సొసైటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. సెమినార్‌లో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, కృత్రిమ మేధ ( ఏఐ ) ఆధారిత నేరాలు, డీప్‌ఫేక్‌లు, డ్రోన్‌ల దుర్వినియోగం, డిజిటల్ ఆధారాలు, స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. మారుతున్న నేరాల స్వభావానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా వినియోగించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక నైపుణ్యం, డిజిటల్ ఫోరెన్సిక్ సామర్థ్యాలు, జాతీయ--అంతర్జాతీయ స్థాయి సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు. అదే విధంగా ఏఐ వినియోగంలో నైతిక ప్రమాణాలు, పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. ప్రజల విశ్వాసం, సహకారం, భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని, కమ్యూనిటీ పోలీసింగ్‌కు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతతో పాటు బాధితుల పట్ల సున్నితమైన స్పందనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బందికి సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్స్, ఏఐ నాయకత్వం, ఒత్తిడి నిర్వహణ తదితర అంశాల్లో నిరంతర శిక్షణ అవసరమని తెలిపారు. ఈ సెమినార్‌లో మాజీ డీజీపీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రిటైర్డ్ పోలీస్ ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఐపీఎస్ జమ్మూ కాశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్ర కుమార్, కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె. పద్మనాభయ్య, ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ దుర్గా ప్రసాద్ కోడె, హిమాచల్ ప్రదేశ్ మాజీ డీజీపీ సంజయ్ కుండు తదితరులు పాల్గొన్నారు. రోజంతా సాగిన సెమినార్‌లో చర్చించిన అంశాలు, పాలసీ సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని కన్వీనర్ కపిలవాయి దిలీప్ కుమార్ వెల్లడించారు.

# ప్రజాపాలనలో పారదర్శకతకే పెద్దపీట: కిచ్చెన్నలక్ష్మారెడ్డి





( ఆగస్ట్ -8- హంస కలంవార్త )

నేటి నుంచి 'చేయూత' పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగ సందడి కొనసాగుతుండగా 'చేయూత' పింఛన్ల పండుగ కూడా ప్రారంభమైందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ( కె ఎల్ ఆర్ ) అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కొత్తగా పింఛన్లు పొందేందుకు అర్హులైన వారు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని కె ఎల్ ఆర్ తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు తదితర అర్హులైన వారు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**-ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్లు**

ఈ నెల 15వ తేదీ నుంచి కొత్త పింఛన్లను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కిచ్చెన్న లక్ష్మారెడ్డి తెలిపారు. పింఛన్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హత ఉన్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అర్హులైన వారు 'చేయూత' వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన వివరాలను పూర్తి చేసి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్కు సమర్పించాలని ఆయన సూచించారు.

**-ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువతదే కీలక పాత్ర**

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కీలక పాత్ర పోషించాలని మాజీ లెక్చరర్ కిచ్చెన్న లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. నిఖార్సైన, నిజాయితీ పరుడు, విద్యావంతుడైన వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకు నేందుకు పట్టభద్రులు ముందుకు రావాలని కోరారు. వివిధ హోదాల్లో, పలు సంస్థలు, కంపెనీల్లో పనిచేస్తున్న పట్టభద్రులు తమ ఎమ్మెల్సీ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, తద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. భావి భారతాన్ని తీర్చిదిద్దడంలో జెన్ జీ యువత ముందుం డాలని కె ఎల్ ఆర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

**-కేంద్రంలోనూ జవాబుదారీతనం అవసరం**

ఢిల్లీలో జెన్ జీ ఉద్యమం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించిందని కె ఎల్ ఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజాపాలన పారదర్శకంగా, జవాబుదారీతనంతో కొనసాగుతున్నట్లే కేంద్రంలోనూ ప్రజలకు జవాబుదారీగా పాలన సాగాలని ఆకాంక్షించారు. పెద్దల సభ అయిన శాసనమండలికి విద్యావేత్తలు, మేధావులు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తులను పంపాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధికి విద్యావంతులైన ప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**-సేవకుడే నిజమైన నాయకుడు**



మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశం ఉన్నతంగా అభివృద్ధి చెందుతుందని లీడ్ ఇండియా అధినేత కె ఎల్ ఆర్ అన్నారు. ప్రజలకు సేవ చేసే వ్యక్తినే నిజమైన నాయకుడిగా గుర్తించాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగాల వైపు మొగ్గు చూపుతున్న యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని సమాజ సేవలో భాగస్వా ములు కావాలని కోరారు. ఇదిలా ఉండగా రేపు జరగ నున్న బోనాల పండుగ కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు, నాయకులు కెఎల్‌ఆర్ ను ఆహ్వానిం చినట్లు తెలిపారు.

# తులసి నగర్‌లో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు





(ఆగస్ట్ -8- హంస కలంవార్త )

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న జగదీశ్వర్ గౌడ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, దొడ్ల రామకృష్ణ గౌడ్ శేరిలింగంపల్లి: బోనాల పండుగ శుభసందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి నగర్ కాలనీలో శు క్రవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, భక్తిశ్రద్ధలతో పండుగను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాలనీ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువత, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డికి ఘన సన్మానం

(ఆగస్టు-8- హంస కలంవార్త )

ఎంపీ ఈటల రాజేందర్‌కు బోనాల ఉత్సవాల ఆహ్వానం మేడ్చల్--మల్కాజ్‌గిరి: మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా (అర్బన్) భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన డి. గిరి వర్ధన్ రెడ్డితో కలిసి బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డిని వడ్డేపల్లి రాజేశ్వరరావు శాలువాతో ఘనంగా సన్మానించి, నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఆషాఢ మాసం చివరి ఆదివారం సంద ర్భంగా రేపు కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించనున్న శ్రీ చిత్తారమ్మ తల్లి, పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలకు ఎంపీ ఈటల రాజేందర్‌ను వడ్డేపల్లి



రాజేశ్వరరావు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎంపీకి అందజేసి, అమ్మవారి బోనాల వేడుకల్లో పాల్గొనాలని కోరారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా



నిలుస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని నాయకులు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఐలయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి: బండి రమేష్





(ఆగస్ట్ -8- హంస కలంవార్త)

గాయత్రినగర్‌లో ఘనంగా అమ్మవార్లకు 'సారె' సమర్పణ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవడంతో పాటు, తరతరా లుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టి పి సి సి వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ అన్నారు. గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని వివేకానం దనగర్ కాలనీలో పుణ్యదంపతులు వేముల స్రవంతి, వేముల సత్యం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అమ్మవార్లకు 'సారె' సమర్పణ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని 11 దేవాల యాల్లో కొలువైన అమ్మవార్లకు వేముల సత్యం దంప తులు గాజులు, చీరలు, వేటపోతులు, ఇతర పూజా సామగ్రిని 'సారె'గా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బండి రమేష్ మాట్లా డుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని అన్నారు. ఆషాఢ మాసంలో ప్రతి ఇంటి నుంచి బోనం ఎత్తుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిం చడంతో పాటు వాటికి మరింత ప్రోత్సాహం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మన పండుగలు, ఆచారాలు భవిష్యత్ తరాలకు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహ రించాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలం దరూ సుఖసంతోషాలతో జీవించాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు బండి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల సత్యం దంపతులతో పాటు గాయత్రినగర్ డివిజన్ అధ్యక్షులు మస్తాన్ రెడ్డి, కనకయ్య, రాము, రమణ, వాసు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమి కేటాయింపుపై తీవ్ర ఆరోపణలు

(ఆగస్టు -8- హింస కలంవార్త )

రావిర్యాల ఫోర్త్ సిటీలో 5 ఎకరాల భూమి కేటాయింపుపై ప్రతిపక్షాల విమర్శలుదహైదరాబాద్: మహేశ్వరం మండలం రావిర్యాల పరిధిలోని ఫోర్త్ సిటీలో ప్రభుత్వ భూమి కేటాయింపుపై రాజకీయ ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. సుమారు 5 ఎకరాలు (20,234 చదరపు మీటర్లు) విలువైన ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకు ఓ ప్రైవేట్ సంస్థకు కేటాయించారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ భూమి విలువ సుమారు రూ.135 కోట్లు ఉంటుందని, అయితే కేవలం రూ.7 కోట్లకే కేటాయించారంటూ ఆరోపణలు చేస్తున్నారు. ఈ కేటాయింపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్న సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోపణల ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డికి చెందిన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థకు ఈ భూమిని కేటాయించినట్లు పేర్కొంటున్నారు. సంస్థకు అనుముల కొండల్ రెడ్డి చైర్మన్‌గా, ఆయన కుమారుడు అనుముల నయన్ రెడ్డి సీఈఓగా ఉన్నారని ఆరోపణల్లో పేర్కొన్నారు. కంపెనీ ప్రారంభ పెట్టుబడి సుమారు రూ.1 లక్షతో ప్రారంభమైందని, అనంతరం ప్రభుత్వ భూమి కేటాయింపు వ్యవహారం చోటుచేసుకుందని విమర్శకులు పేర్కొంటున్నారు. అయితే, ఈ భూమి కేటాయింపు ఏ నిబంధనల ప్రకారం జరిగింది? భూమి ధరను ఏ ప్రాతిపదికన నిర్ణయించారు? కేటాయింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, టెండర్ లేదా ఇతర ప్రక్రియ ఏమిటి? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని విమర్శకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటించాలని, భూమి విలువ, కేటాయింపు విధానం, లబ్ధిదారుల అర్హతలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడిం చాలని వారు




కోరుతున్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత సంస్థల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

## అన్నదానమే మహాదానం.. హోప్ ఫౌండేషన్ సేవా యజ్ఞం



(ఆగస్ట్-8- హింస కలంవార్త )

196వ వారం 3,200 మందికి అన్న ప్రసాదం.. సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం: కొండ విజయ్ కుమార్ చందానగర్: హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరంతర అన్నదాన కార్యక్రమాల్లో భాగంగా 196వ అన్నదాన కార్యక్రమాన్ని శనివారం గంగారంలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద



ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్తో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొని భక్తులు, ప్రజలకు అన్న ప్రసాదాలను స్వయంగా వడ్డించారు. ఈ వారంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి సుమారు 3,200 మంది హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పేదలు, నిరుపేదలు, ఆకలితో ఉన్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆకలితో ఉన్న వారికి కడుపునిండా అన్నం పెట్టి వారి ఆకలిని తీర్చడం ద్వారా తనకు ఎంతో సంతృప్తి లభిస్తుందని విజయ్ కుమార్ పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో అన్నదానం ఎంతో గొప్పదని, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అవసరమైన వారికి సహాయం చేయడమే తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా సేవా కార్యక్రమాలను కొనసా



గిస్తామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరిం చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిరం తరం కొనసాగిస్తామని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పై నిలిచిన నీటి కుంటలో కుర్చోని నిరసన తెలిపిన వార్డు కౌన్సిలర్



(ఆగస్ట్-8- హింస కలంవార్త )

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాత్రి కురిసిన వర్షంనికి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి కరీంనగర్ జాతీయ రహదారి అయిన స్టేషన్ రోడ్డు లోని పోలీస్ స్టేషన్ ముందు వరద నీరు ఎటు వైపు కుడా వెళ్లకుండా ఒక ప్రదాన రహదారి ఒక కుంటను, ఒక చెరువును తలపిస్తు రహదారి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఇట్టి వరద నీటి కుంట వల్లన ప్రమాదాలకు గురవుతున్నారు ఇట్టి నీటి కుంటతో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇదే దారిలో ఉంది రోగులు, క్షతగాత్రులు ఎమర్జెన్సీ సమయంలో 108 వాహనం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు విలువైన ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోతున్నాయి కామారెడ్డి కరీంనగర్ ప్రదాన రహదారి ఇది ఒక్కటే కావున సమస్యను తోందరగా యుద్ధప్రాతిపదికన పరిష్కరించడానికి అదికారులు చర్యలు తీసుకోవాలి అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించకుంటే అక్కడే దీక్ష చేపడతానని ఆయన అన్నారు.

# ఎన్నికలప్పుడు కొట్లాడదాం.. అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం

ఆగస్టు-8- హంస కలంవార్త )







కూకట్‌పల్లి అభివృద్ధికి పార్టీలకు అతీతంగా ముందుకు సాగాలి: బండి రమేష్ కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడుదామని, ప్రస్తుతం ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును తాను కోరినట్లు తెలిపారు.

కూకట్‌పల్లి వసంత్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఎంఆర్ , విశ్వంభర కాలనీల్లో నియోజకవర్గ నాయకులు మాకినేని యాక నారాయణ వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాదయాత్రకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలను పేరుపేరునా పలకరించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను స్థానికులు బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**-కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ జేఎన్టీయూ సమీపంలో స్కైవాక్, గోపాల్‌నగర్--మంజీరా రోడ్డు అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మైసమ్మ చెరువు, కాముని చెరువు, సున్నం చెరువు, ఐడియల్‌ఐడియల్ చెరువులను హైడ్రా సహకారంతో ఆక్రమణల నుంచి పరిరక్షించి, అభివృద్ధి చేసి సుందరీకరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ సృజనను కలిసి చర్చించినట్లు తెలిపారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని, ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బండి రమేష్ పేర్కొన్నారు.

**-రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

“కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాలి. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయంగా పోరాడుదాం.. కానీ ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాత్రం కలిసి ముందుకు సాగుదాం” అని బండి రమేష్ స్పష్టం చేశారు. వసంత్‌నగర్ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రజా పాదయాత్ర నిర్వహించిన యాక నారాయణ వినోద్, నిర్వాహకులను బండి రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, సాయిబాబు చౌదరి, రంగమోహన్, చవ్వ శ్రీనివాస్, మాధవరెడ్డి, శివరామకృష్ణ, నవీన్, గోపాల్ చౌదరి, రమణ, వాసు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మల సంప్రదాయ వృత్తులకు ఆదరణ కరువు.. ఉపాధి కోసం ఎదురుచూపులు









(ఆగస్టు -8- హంస కలంవార్త )

ఆధునికత, మారుతున్న మార్కెట్‌తో కనుమరుగవుతున్న కులవృత్తులు.. కొత్త తరానికి కొత్త అవకాశాలు కల్పించాలి

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో విశ్వకర్మల పాత్ర ఎంతో ప్రత్యేకమైనది. తరతరాలుగా తమ చేతివృత్తులను నమ్ముకుని జీవిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విశ్వకర్మ కుటుంబాలు నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఒకప్పుడు వారి చేతివృత్తులకు మంచి డిమాండ్ ఉండగా.. ఆధునిక యంత్రాలు, మార్కెట్‌లో వచ్చిన మార్పులు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు నగరాలకు రావడం, సంప్రదాయ వృత్తులపై ఆధారపడే వారి సంఖ్య తగ్గిపోవడం వంటి కారణాలతో ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశ్వకర్మ సమాజంలో సంప్రదాయంగా కమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పకారులు, ఇతర చేతివృత్తులతో అనుబంధం ఉన్న కుటుంబాలు ఉన్నాయి. ఇనుము, కలప, లోహాలు, ఆభరణాలు, శిల్పకళ వంటి రంగాల్లో తమ నైపుణ్యాన్ని తరతరాలకు అందిస్తూ వచ్చిన ఈ వృత్తులు కేవలం ఉపాధి మార్గాలు మాత్రమే కాదు.. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక వారసత్వంలో భాగంగా నిలిచాయి.

**-ఒకప్పుడు చేతివృత్తులే జీవనాధారం**

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు కమ్మరి, వడ్రంగి, కంసాలి వంటి చేతివృత్తులకు ప్రత్యేకమైన గౌరవం ఉండేది. వ్యవసాయ పనులకు అవసరమైన పనిముట్లు తయారు చేయడం, ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కలప పనులు చేయడం, వివిధ లోహ వస్తువులు తయారు చేయడం, ఆభరణాలు రూపొందించడం వంటి పనులకు వీరి నైపుణ్యం తప్పనిసరిగా ఉండేది. కానీ కాలక్రమేణా యంత్రాలు, ఫ్యాక్టరీల్లో తయారయ్యే వస్తువులు మార్కెట్‌లోకి రావడంతో చేతివృత్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గిపోయింది. తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో సంప్రదాయ వృత్తులకు మార్కెట్ క్రమంగా తగ్గింది.

**-హైదరాబాద్‌లో పరిస్థితి మరింత భిన్నం**

ఉపాధి కోసం తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు అనేక కుటుంబాలు తరలివస్తున్నాయి. అదే సమయంలో ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి కూడా వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులు నగరానికి వస్తున్నారు. దీంతో సంప్రదాయంగా ఒక వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న స్థానిక కుటుంబాలకు పోటీ పెరిగిందని కొందరు విశ్వకర్మ వృత్తిదారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహించే వారు అద్దెలు, ముడిసరుకు ధరలు, విద్యుత్ ఖర్చులు, కార్మిక వ్యయం వంటి భారాలను భరించలేక ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. ఒకప్పుడు తమ కుటుంబాన్ని పోషించిన వృత్తే నేడు స్థిరమైన ఆదాయాన్ని ఇవ్వడం లేదని, కొత్త తరం పిల్లలు కూడా ఈ వృత్తులపై ఆసక్తి చూపడం లేదని పలువురు చెబుతున్నారు.

**-కొత్త తరానికి కొత్త అవకాశాలు అవసరం**

ప్రస్తుత పరిస్థితుల్లో సంప్రదాయ వృత్తులను కాపాడటంతో పాటు విశ్వకర్మ యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించాల్సిన అవసరం ఉంది. కేవలం పాత వృత్తులకే పరిమితం కాకుండా ఆధునిక కార్పెంటరీ, ఇంటీరియర్ డిజైన్, సి ఎన్ సి మెషినింగ్, వెల్డింగ్, జ్యువెలరీ డిజైన్, 3 డి మోడలింగ్, శిల్పకళ, ఎలక్ట్రికల్ మరియు ఇతర సాంకేతిక రంగాల్లో శిక్షణ అందిస్తే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు కలిసి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. శిక్షణతో పాటు స్వయం ఉపాధి కోసం తక్కువ వడ్డీ రుణాలు, ఆధునిక పరికరాలు, మార్కెటింగ్ సహాయం, వర్క్‌షాప్‌ల ఏర్పాటుకు స్థలం వంటి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**-చేతివృత్తులకు మార్కెట్ కల్పించాలి**

విశ్వకర్మల చేతివృత్తులను కేవలం కులవృత్తులుగా కాకుండా ఒక ప్రత్యేకమైన కళగా, నైపుణ్యంగా గుర్తించి మార్కెట్ కల్పించాల్సిన అవసరం ఉంది. నేటి యువతకు సంప్రదాయ కళలతో పాటు ఆధునిక డిజైన్ పరిజ్ఞానాన్ని అందిస్తే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో కూడా అవకాశాలు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాలు, దేవాలయాలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల్లో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించడం ద్వారా సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించవచ్చు. విశ్వకర్మ కళాకారులు తయారు చేసే వస్తువులకు ప్రత్యేక ప్రదర్శనలు, మార్కెటింగ్ మేళాలు నిర్వహిస్తే వారికి నేరుగా ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది.

**-వృత్తి మార్పు తప్పు కాదు.. నైపుణ్యానికి విలువ రావాలి**

కాలం మారుతున్న కొద్దీ వృత్తులు కూడా మారడం సహజమే. కొత్త తరం పిల్లలు విద్యను అభ్యసించి వివిధ రంగాల్లోకి వెళ్లడం కూడా మంచి పరిణామమే. అయితే తరతరాలుగా సమాజానికి సేవ చేసిన చేతివృత్తులు పూర్తిగా కనుమరుగుకాకుండా వాటిని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. విశ్వకర్మల చేతుల్లో ఉన్న నైపుణ్యం ఒక విలువైన సంపద. ఆ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దితే ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా తెలంగాణ సంప్రదాయ కళలకు కూడా కొత్త జీవం వస్తుంది.

**-ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి**





విశ్వకర్మ వృత్తిదారుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పలువురు కోరుతున్నారు. వృత్తి ఆధారిత కుటుంబాల కోసం ప్రత్యేక నైపుణ్య శిక్షణ, ఆధునిక పనిముట్ల పంపిణీ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ సహాయం, ఆరోగ్య--బీమా పథకాలు, పిల్లల విద్యకు ప్రోత్సాహకాలు అందిస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉంది. అలాగే హైదరాబాద్ వంటి నగరాల్లో చిన్న వర్క్‌షాపులు నిర్వహించే సంప్రదాయ వృత్తిదారులకు తగిన స్థలం, మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. మధ్యవర్తులపై ఆధారపడకుండా కళాకారులు నేరుగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను విక్రయించేలా డిజిటల్ మార్కెటింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వాలి.

**-విశ్వకర్మల భవిష్యత్తు కోసం సమిష్టి కృషి అవసరం**

విశ్వకర్మ సమాజం ఎదుర్కొంటున్న సమస్య ఒక్కరోజులో పరిష్కరించేది కాదు. సంప్రదాయ వృత్తులను కాపాడటం, కొత్త తరానికి ఆధునిక విద్య--నైపుణ్యాలు అందించడం, మార్కెట్ అవకాశాలు పెంచడం, స్వయం ఉపాధిని ప్రోత్సహించడం వంటి అంశాలపై సమగ్రంగా దృష్టి పెట్టాలి. తమ చేతులతో సమాజానికి అవసరమైన ఎన్నో వస్తువులను తయారు చేసిన విశ్వకర్మ వృత్తిదారుల నైపుణ్యానికి తగిన గుర్తింపు, గౌరవం, ఆదాయం లభించేలా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. విశ్వకర్మల చేతివృత్తి కేవలం గతానికి సంబంధించిన జ్ఞాపకం కాకుండా.. ఆధునిక సాంకేతికతతో కలసి భవిష్యత్తులోనూ కొనసాగాల్సిన విలువైన వారసత్వం. అందుకు ప్రభుత్వం, సమాజం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే విశ్వకర్మ కుటుంబాల్లో మళ్లీ ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.



-ప్రత్యేక విశ్లేషణ: వి. విష్ణుమూర్తి

# వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండండి.. ప్రతి ప్రయాణం జాగ్రత్తగా!






(ఆగస్టు -8- హంస కలంవార్త )

మ్యాన్‌హోల్స్, రోడ్ల గుంతలు, విద్యుత్ వైర్లతో ప్రమాదం.. టూ వీలర్ వాహనదారులు, పాదచారులు మరింత అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగరవాసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో నగరం లోని పలు రోడ్లపై నీరు నిలిచిపోవడం, గుంతలు నీటితో నిండిపోవడం, డ్రైనేజీలు పొంగి పొర్లడం, కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ కనిపించకుండా పోవడం వంటి పరిస్థితులు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసర ప్రయాణాల్లో కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. వర్షం కురుస్తున్న సమయంలో రోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. తడి రోడ్లపై వాహనాల వేగాన్ని తగ్గించడంతో పాటు, ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి. నీటితో నిండిన గుంతలు కనిపించక పోవడంతో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పే అవకాశం ఉన్నందున తెలియని నీటిలోకి వేగంగా వెళ్లకూడదు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, వర్షంలో వాహనం నడుపుతున్నప్పుడు తొందరపాటు నిర్ణయాలకు దూరంగా ఉండాలి.

**-మ్యాన్‌హోల్స్‌పై ప్రత్యేక అప్రమత్తత**

భారీ వర్షాల సమయంలో తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్ ప్రజలకు తీవ్ర ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. రోడ్లపై నీరు నిలిచినప్పుడు మ్యాన్‌హోల్ ఎక్కడ ఉందో గుర్తించడం కష్టం. పాదచారులు నీటిలో నడిచేటప్పుడు, ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. నీటితో నిండిన రోడ్డులో రోడ్డు పరిస్థితి స్పష్టంగా కనిపించకపోతే ఆ మార్గంలో వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవడం మంచిది. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ కనిపిస్తే దాని దగ్గరకు వెళ్లకుండా ఇతరులను కూడా అప్రమత్తం చేయాలి. సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

**-విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్త**

వర్షం, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉంటుంది. తెగిపోయిన విద్యుత్ వైరు రోడ్డు మీద లేదా నీటిలో కనిపిస్తే దాని దగ్గరకు వెళ్లకూడదు. చేతితో తాకడం లేదా దానిని తొలగించే ప్రయత్నం చేయడం ప్రమాదకరం. నీటితో నిండిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. ప్రమాదకర పరిస్థితి కనిపిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలి.

**-బస్సు, ఆటో ప్రయాణికులు జాగ్రత్త**

వర్షాకాలంలో బస్సులు, ఆటోల్లో ప్రయాణించే వారు కూడా జాగ్రత్తలు పాటించాలి. బస్సు కోసం వేచి ఉన్నప్పుడు రోడ్డుపై కాకుండా సురక్షితమైన ప్రదేశంలో నిలబడాలి. బస్సు పూర్తిగా ఆగిన తర్వాతే ఎక్కాలి, దిగేటప్పుడు కూడా తొందరపడకూడదు. ఆటోలో ప్రయాణించే సమయంలో డ్రైవర్‌ను వేగంగా వెళ్లాలని ఒత్తిడి చేయకుండా రోడ్డు పరిస్థితులకు అనుగుణంగా నెమ్మదిగా ప్రయాణించేలా చూడాలి. నీరు ఎక్కువగా ఉన్న రోడ్లలోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవడం మంచిది.

**-పాదచారులు మరింత జాగ్రత్తగా ఉండాలి**

వర్షపు నీటితో నిండిన రోడ్లపై నడిచేటప్పుడు పాదచారులు అప్రమత్తంగా ఉండాలి. నీటిలో గుంతలు, మ్యాన్‌హోల్స్, చెత్త లేదా ఇతర ప్రమాదకర వస్తువులు కనిపించకపోవచ్చు. నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో నడవకుండా వీలైనంత వరకు సురక్షితమైన మార్గాన్ని ఎంచుకోవాలి. పిల్లలను రోడ్లపై నిలిచిన వర్షపు నీటిలో ఆడనివ్వకూడదు. వర్షపు నీటిలో విద్యుత్ ప్రమాదం ఉండే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

**-ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బందులు**

భారీ వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉంది. రోడ్లపై నీరు నిలవడం, వాహనాల వేగం తగ్గడం, కొన్ని ప్రాంతాల్లో రహదారి పరిస్థితులు దెబ్బతినడం వంటి కారణాలతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సమయంలో వాహనదారులు ఓపికగా వ్యవహరించాలి. అనవసరంగా ఓవర్‌టేక్ చేయడం, వేగంగా వాహనం నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. అత్యవసర వాహనాలకు మార్గం ఇవ్వాలి.

**-అత్యవసరమైతేనే ప్రయాణం**

భారీ వర్షం కురుస్తున్న సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది. తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే ముందుగా రోడ్డు, ట్రాఫిక్ పరిస్థితులను తెలుసుకుని ప్రయాణం ప్రారంభించాలి.వర్షంలో కొన్ని నిమిషాలు ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం తప్పు కాదు.. కానీ తొందరపడి ప్రమాదానికి గురికావడం మాత్రం ఎప్పటికీ మంచిది కాదు.

ప్రజలకు ముఖ్య సూచనలు

-వర్షంలో వాహన వేగాన్ని తగ్గించాలి.

-టూ వీలర్‌పై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.

-నీటితో నిండిన రోడ్లపై అప్రమత్తంగా వెళ్లాలి.

-తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలి.

-తెగిన విద్యుత్ వైర్లను తాకకూడదు.

-నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న రోడ్లలోకి వెళ్లకూడదు.

-బస్సు, ఆటోల్లో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తొందరపడకూడదు.

-ట్రాఫిక్ జామ్‌లో ఓపికగా వ్యవహరించాలి.

-పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకోవాలి.

-ప్రమాదకర ప్రాంతాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

వర్షాకాలంలో మన భద్రత మన చేతుల్లోనే ఉంటుంది. వర్షం ఎంత భారీగా కురిసినా.. మన జాగ్రత్త అంతకంటే బలంగా ఉండాలి. సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే ప్రతి ప్రయాణికుడి మొదటి లక్ష్యం కావాలి.

-వి విష్ణు రిపోర్టర్

## అంతిమయాత్రను సురక్షితంగా వైకుంఠ రథం

**-తల్లిదండ్రులు చంద్రకళ రాజారెడ్డి ల జ్ఞాపకార్థం**

**-వైకుంఠ రథం అందించిన మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి**



(ఆగస్ట్-8- హింస కలంవార్త )

చనిపోయిన వ్యక్తుల పార్తివదేహాలను వైకుంఠధామం, స్మశాన వాటిక ల వరకు తీసుకెళ్లడానికి వీలుగా చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి అతని సోదరులు గొల్లపల్లికి రూపాయలు మూడు లక్షలతో తయారుచేసిన స్టీల్ వైకుంఠ రథాన్ని అందించారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి, కుల పెద్దల సమక్షంలో ప్రారంభోత్సవాన్ని చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గొల్లపల్లిలో చనిపోయిన వ్యక్తులను వైకుంఠధామాలు వరకు తీసుకెళ్లడానికి సుమారుగా రెండు కిలోమీటర్లకు పైగా దూరం ఉంటుందని మృతదేహాలను వైకుంఠధామం వరకు తీసుకెళ్లడానికి ఆయా కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.ఇతర ప్రాంతాల నుంచి వైకుంఠ రథం తెప్పించడానికి సుమారుగా రూపాయలు మూడు నుంచి ఐదు వేల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. చనిపోయిన వారి పార్తివదేహాల అంతిమయాత్రను సురక్షితంగా వైకుంఠ దామం వరకు చేర్చడానికి ఈ వైకుంఠ రథం గొల్లపల్లికి ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ ఇబ్బందులను గుర్తించిన గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ రెడ్డి సంఘం అధ్యక్షులు పీసు తిరుపతిరెడ్డి రంజిత్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వైకుంఠ రథం అవసరాలను వారికి వివరించారు. మరణించిన వారి తల్లిదండ్రులు గడ్డం చంద్రకళ రాజారెడ్డి ల జ్ఞాపకార్థం వారి కుమారులైన చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, రిటైర్డ్ ఎస్పి రాజా రవీందర్ రెడ్డి, రమేష్ రెడ్డిల ఆర్థిక సహాయంతో రూపాయలు మూడు లక్షల వ్యాయంతో తయారు చేయించిన వైకుంఠ రథాన్ని ప్రారంభించి పెద్దల సమక్షంలో గ్రామ పంచాయతీకి ప్రజల అవసరాల కోసం అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుచ్చిరెడ్డి, కుల సంఘాల నాయకులు ముస్కు లింగారెడ్డి, భూమయ్య బొల్లం రమేష్ వెంకటరమణ కనుకుంట్ల లింగారెడ్డి సంపత్ సత్యనారాయణ కొమురయ్య ఉమేష్ రావు కృశా సతీష్ రమేష్ చిర్ర దిలీప్ కోమల్ల జెలందర్ తాండ్ర కిరణ్ రత్నం రమేష్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సొసైటీ చైర్మన్ చిందల శ్రీనివాస్ రెడ్డి నీ సన్మానించిన షబ్బీర్

(ఆగస్ట్-8- హింస కలంవార్త )



కామారెడ్డి మండలం నూతన వ్యవసాయ సహకార సంఘంచైర్మన్ గా చిందల శ్రీనివాస్ రెడ్డి నియమితులైన్నారు. శనివారం హైదరాబాదులోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ని మర్యాదపూర్వకంగా కలిసి సొసైటీ చైర్మన్ గా నియమించినందుకు షబ్బీర్ అలీ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజగౌడ్, SC సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, రాజు, రాజేష్, సీతారాం నాయక్, రమేష్ నాయక్, రమేష్, వెంకటేశ్వర్, సాయిలు, లింగం, కుమార్ గౌడ్ తతిదారులు పాల్గొన్నారు.

# రూ.1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





ఆగస్టు -8- హంస కలంవార్త )

కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండిమైసమ్మలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గండిమైసమ్మలోని రాజరాజేశ్వర కాలనీలో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, రూ.63 లక్షలతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అలాగే శ్రీనివాస్ నగర్ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. మొత్తం రూ.1.83 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు కోరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, సామాన్య ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని శ్రీశైలం గౌడ్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ముత్యం రెడ్డి, యాదవ రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సదానందం, తిరుపతి రెడ్డి, స్థానిక కాలనీ అధ్యక్షులు రాజిరెడ్డి, మోహన్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449